# వెనుకబడిన కులాల వారి అవసరాలు

# చూడవలసిన బాధ్యత సమాజానిదే

## ప్రత్యేక ఇంటర్వ్యూలో డాక్టర్ బాలగోపాల్

సమాజంలో బలహీనుల ప్రత్యేకించి వెనుకబడ్డ కులాలు, తెగల విద్యా అవసరాలను, ఆర్థిక అవసరాలను ప్రత్యేక శ్రద్ధతో తీర్చాలని, సామాజిక అన్యాయాల నుండీ, దోపిడీల నుండీ వారిని కాపాడాలని ఆంధ్రప్రదేశ్ పౌర హక్కుల సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీ కె. బాలగోపాల్ కోరారు.

దళిత సంఘాలతో కలసి తాము అందుకే ఆందోళన సాగిస్తున్నామని అందులోని భాగంగా విజయనగరం, విశాఖపట్నం, నెల్లూరు, హైదరాబాద్, వరంగల్, గుంటూరు, కృష్ణా జిల్లాలలో ఇంతవరకూ సమావేశాలు నిర్వహించినట్లు ఆయన వెల్లడించారు. సమాజంలో మైనారిటీలకు ఏనాడైతే భద్రత కల్పించగలుగుతామో ఆనాడే, అది "నాగరికత" కాగలుగుతుందని ఆయన అంటూ, దేశంలో 'మైనారిటీ' అనే విభజనే లేదనే వాదాలు నిరాధారాలని మైనారిటీలు ఉన్నారనేది మౌలికమైన వాస్తవమని ఆయన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఒక ప్రశ్నకు సమాధానం ఇచ్చారు.

దేశంలో నెలకొన్న అప్రజాస్వామిక వాతావరణంలో సుప్రీంకోర్టు అంతిమ తీర్పు ఇచ్చేటప్పుడు దళితులకు అన్యాయం జరగకుండా చూడడం ప్రజాస్వామికవాదుల కర్తవ్యమని ఆయన చెప్పారు.

మురళీధరరావు కమిషన్ మీద వేసిన కేసులో రాష్ట్ర హైకోర్టులో వాదోపవాదాలు జరుగుతున్న కాలంలో, కేసు వేసిన ఆందోళనకారులు రాష్ట్ర మంతా రాస్తారోకోలు, బంద్‌లు నిర్వహించిన సంఘటనలను ఉదహరిస్తూ తీర్పు తేదీ దగ్గర పడేకొద్దీ కోర్టుపై ఒత్తిడి పెరగవచ్చునని ఆయన అన్నారు. కోర్టులే రాష్ట్రాన్ని కాపాడాలని అప్పట్లో పత్రికలు పేర్కొన్నాయని, అయితే న్యాయమూర్తులు కూడా మనుషులే కాబట్టి వత్తిడి ప్రభావం ఉండకపోదని ఆయన అభిప్రాయపడ్డారు.

### చంపకందొరై రాజన్ కేసు

రిజర్వేషన్ల విషయంలో న్యాయమూర్తులు పేర్కొన్న అంశాలను, కాలానుగుణంగా వస్తున్న మార్పులను డాక్టర్ బాలగోపాల్ విశ్లేషించారు. 1951వ సంవత్సరంలో మొట్టమొదటిసారిగా చంపకందొరై రాజన్ కేసులో రిజర్వేషన్లు భారత రాజ్యాంగంలోని 15 [1], 29 [2] అధికరణలకు విరుద్ధమని ప్రకటించినప్పటి నుండి ఈ విషయం కోర్టులలో నలుగుతోందని ఆయన చెప్పారు.

రిజర్వేషన్ల విషయంలో సరైన తీర్పు చెప్పడానికి అవసరమయ్యే సామాజిక శాస్త్ర పరిజ్ఞానం కానీ, సామర్థ్యం కాని జడ్జీలకు లేవని జస్టిస్ ఎ.పి. సేన్ స్పష్టం చేయడాన్ని ఆయన ఉదహరిస్తూ అయినప్పటికీ తీర్పులు ఇస్తూనే ఉన్నారని పేర్కొన్నారు. చంపకదొరై రాజన్ కేసు ఫలితంగా పార్లమెంటు మొట్టమొదటి రాజ్యాంగ సవరణను చేపట్టి అధికరణం 15 [4]ను రాజ్యాంగానికి చేర్చి సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగతులకు రిజర్వేషన్లు ఇవ్వడాన్ని రాజ్యాంగ బద్ధం చేసిందని ఆయన వెల్లడించారు. అయితే రిజర్వేషన్లను కోర్టులు సూత్రప్రాయంగా ఆమోదిస్తూనే, 50 శాతం మించరాదంటూ వెనుకబడినతనానికి కులం ప్రమాణం కాదని ఆంక్షలు పెట్టాయని ఆయన వివరించారు. కోర్టుల వైఖరి దాగిన లాటగా మారిందని జస్టిస్ డి.ఎ. దేశాయ్‌లు వైఖరితో ఆయన ఏకీభవించారు.

రిజర్వేషన్లను దళితుల హక్కుగా భావించే వారందరూ భారత ప్రభుత్వానికి గల గురుతర బాధ్యతను, కోర్టుల బాధ్యతను గుర్తు చేయాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు. సామాజిక సంఘర్షణల శాసనాల రూపమో, జీవోల రూపమో పరిశీలిస్తే రాజ్యాంగాన్ని అడ్డుపెట్టుకుని అటో, ఇటో న్యాయస్థానాలను ఆశ్రయించడం తప్పదని ఆయన అన్నారు. రాజ్యాంగంలో ఇమిడివున్న ఆదర్శాలనూ, అణచివేతనూ, అభ్యుదయ విలువలను, అపరిమితమైన అధికారాన్ని తిరిగి వ్యాఖ్యానించుకుని, ఆ విరుద్ధ అంశాల వెనుక దాగివున్న సామాజిక సంఘర్షణల కొనసాగింపుగా ప్రస్తుత సంఘర్షణను విశ్లేషించక తప్పదని ఆయన పేర్కొన్నారు. ఈ సమయంలో కోర్టు నాలుగు గోడల కే ఈ సంఘర్షణ పరిమితంకాక, బహిరంగంగా జరగాలని, ఈ విషయం రిజర్వేషన్ వ్యతిరేకులు స్పష్టంగా గుర్తించినప్పటికీ, ప్రజాస్వామిక వాదులే వెనుకబడివున్నారని ఆయన అభిప్రాయపడ్డారు.

### స్వాతంత్ర్యం అంటే

ప్రభుత్వవిధానాలకు ఉండవలసిన భూమిక గురించి సమాజంలోని అసమానతలను అంతం చేయవలసిన కర్తవ్యాన్ని గురించి, భారత రాజ్యాంగం ఇచ్చే ఆదేశాలకు, రిజర్వేషన్ వ్యతిరేకుల వాదనకూ ఏమాత్రం పొంతన లేదని డాక్టర్ బాలగోపాల్ విమర్శించారు. ప్రజలలో కొందరిని మాత్రం ప్రతిభావంతులుగా గుర్తించి, వాళ్ళ చేతులలో పదవులు, ఉద్యోగాలు, సాంకేతిక సాధనాలు పెట్టి, వాళ్ళ పురోగమనాన్నే ఆకాంక్షిస్తున్నారని, జాతీయోద్యమకాలంలో ఇలా ఎవ్వరూ భావించలేదని ఈ సందర్భంగా ఆయన వివరించారు.

కులరహిత సమాజం, స్త్రీ పురుష సమానత్వం, దున్నేవానికే భూమిని ఇచ్చే భూసంస్కరణలు, కార్మికులకు గౌరవప్రదమైన జీవితం వంటి ఉన్నతమైన విలువలు సాధించడం, స్వాతంత్ర్య పోరాటంలో భాగం అయ్యాయని, స్వాతంత్ర్యం అంటే కేవలం తెల్లవాడిని తరిమి గద్దెక్కడమని ఆనాడు ఎవ్వరూ భావించలేదని ఆయన వివరించారు. కేవలం రాజ్యాధికారం కోసమే కాకుండా, కార్మికులు, రైతులు, ఆర్థిక దోపిడీకి వ్యతిరేకంగా చేసిన పోరాటాలూ, కుల వ్యవస్థకి, స్త్రీల కుటుంబ బానిసత్వానికి వ్యతిరేకంగా జరిగిన సామాజిక పోరాటాలూ కూడా ఉన్నాయని ఈ సందర్భంలో ఆయన ఉదహరించారు.

అన్ని రకాల అసమానతలకూ నిలయమైన దేశంలో అసమానతలను పారద్రోలి సమానత్వాన్ని సాధించనిదే ఆ స్వాతంత్ర్యం నిజమైన స్వాతంత్ర్యం కాదని భావించారని, ఆ విలువలు తిరస్కరించే వాళ్ళు భారత జాతీయోద్యమానికి ఎంత మాత్రం నిజమైన వారసులు కాదని డాక్టర్ బాలగోపాల్ స్పష్టం చేశారు.

సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం, జాతి జీవనంలోని అన్ని వ్యవస్థల లక్షణం అయినటువంటి సమాజాన్ని ప్రయత్నపూర్వకంగా నిర్మించి, సంరక్షించి తద్వారా ప్రజల క్షేమాన్ని పెంపొందించడం ప్రభుత్వం కర్తవ్యంగా రాజ్యాంగంలోని 38 [1] వ అధికరణ స్పష్టం చేస్తోందని ఆయన పేర్కొన్నారు. ప్రత్యేకించి స్థితిగతులలోనూ, సౌకర్యా

లలోనూ, అవకాశాలలోనూ, సమాజంలోని వ్యక్తుల మధ్యనే కాక, వివిధ వృత్తులను అనుసరించే, లేక వివిధ ప్రాంతాలలో నివసించే వర్గాల మధ్య ఉన్న అంతరాలను తొలగించటం ప్రభుత్వ కర్తవ్యంగా ఆయన పేర్కొన్నారు. 1978వ సంవత్సరంలో 44వ రాజ్యాంగ సవరణ ద్వారా పై రెండవ క్లాజు చేర్చారని ఆయన వివరించారు.

"బాలాజీ వర్సెస్ స్టేట్ ఆఫ్ మైసూరు" కేసులో రిజర్వేషన్లు 50 శాతం మించి ఉండరాదని సుప్రీం కోర్టు 1963వ సంవత్సరంలో చెప్పిందని చాలా మంది ఉదహరిస్తున్నారని, అదే తీర్పులో రిజర్వేషన్లు చేసేటప్పుడు రాజ్యాంగంలోని 46వ అధికరణంలోని ఆదేశాన్ని ప్రధానంగా దృష్టిలో ఉంచుకోవాలని సుప్రీం కోర్టు సూచించడాన్ని ఎందుకు ఉదహరించలేకపోతున్నారని ఆయన ప్రశ్నించారు.

## పోగొట్ట వలసింది ఆర్థిక వివక్ష ఒక్కటేనా?

సామాజిక ఆర్థిక రాజకీయ న్యాయం సాధించాలనీ, స్థితిగతులలోనూ సౌకర్యాలలోనూ, అవకాశాలలోనూ, ఉన్న అంతరాలను తొలగించాలనీ, వెనుకబడ్డ కులాలు, వెనుకబడ్డ తెగలతో సహా బలహీనవర్గాల విద్యా ఆర్థిక అవసరాలను తీర్చడంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని రాజ్యాంగం స్పష్టం చేసినా, కులం ప్రాతిపదికపై రిజర్వేషన్లను ఏ విధంగా వ్యతిరేకిస్తారని ఆయన నిలదీశారు. ఆర్థిక వివక్ష ఒక్కటే దేశంలో పోగొట్టవలసిన వివక్ష అని రాజ్యాంగకర్తలు భావించలేదని, సామాజిక, ఆర్థిక రాజకీయ న్యాయం అనే కీలకమైన ఆదర్శం రాజ్యాంగం ముందుమాటలోనూ, అధికరణం 38లోనూ కూడా ఉందని డాక్టర్ బాలగోపాల్ స్పష్టం చేశారు.

చరిత్రలో కేవలం ఆర్థిక అసమానతలు దోపిడీయే కాక, సామాజిక వివక్ష రాజకీయ వివక్ష కూడా ఉన్నాయని, ఈ అన్యాయానికి ప్రధానమైన ప్రాతిపదిక కుల వ్యవస్థ అనే విషయం అందరికీ తెలుసని ఆయన పేర్కొన్నారు. అయితే ఈ విషయాన్ని గుర్తించేందుకు కోర్టులు కూడా సిద్ధంగా లేవని ఆయన అన్నారు.

రిజర్వేషన్ల విషయమై ఇంతవరకూ పదమూడుసార్లు సుప్రీం కోర్టును కలించడం జరిగిందని, పన్నెండు కేసులు రిజర్వేషన్లకు వ్యతిరేకంగా దాఖలైనవి కాగా పదమూడవదైన వసంతకుమార్ వర్సెస్ "స్టేట్ ఆఫ్ కర్నాటక" కేసులో, కర్నాటక రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టు జడ్జీల సలహా కోసం చేసిన అభ్యర్థన అని ఆయన వివరించారు. జస్టిస్ చిన్నప్పరెడ్డి అభిప్రాయాన్ని మినహాయిస్తే వేరే ఏ ఒక్క కేసులో ఏ ఒక్క న్యాయమూర్తి కూడా మనదేశంలో సామాజిక వెనుకబాటుతనానికి కులవ్యవస్థ ప్రధాన కారణం అని ఊగిసలాట లేకుండా ఒప్పుకోవడానికి సిద్ధంగా ఉన్నట్లు కనిపించడం లేదని ఆయన అభిప్రాయపడ్డారు.

కుల వ్యవస్థను నాశనం చేయడమనేది భారత రాజ్యాంగం ప్రభుత్వానికి ఆదేశించిన కర్తవ్యాలలో ముఖ్యమైనదని, ఈ ఆదేశం వెనుక కులవ్యవస్థకు వ్యతిరేకంగా దేశంలో జరిగిన పోరాటాల చరిత్ర ఉందని ఆయన చెప్పారు. చరిత్రను మర్చిపోయి ఆర్థిక వివక్ష ఒక్కటే రాజ్యాంగం గుర్తించిన వివక్ష అనడం అర్థం లేనిదని ఆయన విమర్శించారు.

## చరిత్ర మరచిపోవద్దు

రాజ్యాంగంలోని 16వ అధికరణంలోని ఐదు క్లాజులలో మూడు క్లాజులు ప్రస్తుత వివాదానికి అవసరమైనవిగా ఆయన పేర్కొన్నారు. ఏ ప్రభుత్వ ఉద్యోగం విషయంలోనైనా, ఏ విషయంలోనైనా పౌరులందరికీ సమాన అవకాశాలు ఉండాలని, పౌరులెవ్వరినీ కూడా జాతి, కుల, మత, లింగ, వంశ, ప్రాంతాల ప్రాతిపదిక మీద ప్రభుత్వ ఉద్యోగాలకు కానీ, ఏ పదవులకు కానీ అనర్హులుగా భావించరాదని, వివక్షపాటించ రాదని ఒకటి, రెండు క్లాజులు సూచిస్తున్నాయన్నారు. నాలుగవ క్లాజు ప్రకారం ప్రభుత్వ ఉద్యోగాలలోనూ, పదవులలోనూ, తగు ప్రాతినిధ్యం లేని వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లు కల్పిస్తే దానికి ఈ అధికరణం అడ్డం రాదని డాక్టర్ బాలగోపాల్ వివరించారు.

శతాబ్దాలుగా కుల వివక్షకు గురైన శ్రామిక ప్రజానీకానికి విద్య ఉద్యోగ రంగాలలో ప్రవేశ హక్కు కల్పించడం కోసం ఉద్దేశించిన ప్రాథమిక హక్కులను వారి కంటే ఎక్కువగా వాళ్ళకే వ్యతిరేకంగా వాడుకున్నది అగ్రకులాలు మాత్రమేనని ఆయన ఆరోపించారు. బ్రాహ్మణ అధికృత చలామణీ అయిన మద్రాసు రాష్ట్రంలో బ్రాహ్మణేతరులకు విద్యా రంగంలో ప్రవేశం కల్పిస్తే కోర్టుకెక్కిన సంఘటన ఉందని, అది విస్మరించరాదనీ ఆయన గుర్తుచేశారు.

రాజ్యాంగంలోని 15[1] అధికరణం 24[2] అధికరణానికి వ్యతిరేకం అంటూ శ్రీమతి చంపకం దొరైరాజన్ కోర్టు కెక్కిందని, ఆమె వాదనను అంగీకరించి సుప్రీంకోర్టు రిజర్వేషన్‌ను కొట్టివేసిందని, ఆ సంఘటన పై 1951వ సంవత్సరంలో భారత పార్లమెంట్ మొట్ట మొదటి రాజ్యాంగ సవరణను తీసుకువచ్చి 15[4]ను రాజ్యాంగంలో చేర్చిందని ఆయన వెల్లడించారు.

మొదటి రాజ్యాంగ సవరణ జరిగినప్పటి నుండి రిజర్వేషన్లకు సంబంధించి సుప్రీంకోర్టు రెండు సందేహాలతో కొట్టుమిట్టాడుతోందని డాక్టర్ బాలగోపాల్ అభిప్రాయపడ్డారు. సామాజికంగానూ, విద్యాపరంగానూ వెనుకబడిన వర్గాలను గుర్తించేందుకు కులం ఏకైక ప్రాతిపదిక కాగలదా అనేది మొదటి సందేహంకాగా, మొత్తం రిజర్వేషన్లకు ఒక గరిష్ఠ పరిమితి ఉండవలసిన అవసరం లేదా అనేది రెండవ సందేహమని ఆయన పేర్కొన్నారు.

"పేదరికాన్నే ఏకైక ప్రమాణంగా తీసుకుంటే భారత జనాభాలో అత్యధిక శాతాన్ని సామాజికంగానూ విద్యాపరంగాను వెనుకబడిన వారుగా గుర్తించవలసి ఉంటుంది. అప్పుడు ఆర్థిక ప్రాతిపదిక మీద కల్పించే రిజర్వేషన్లు సామాజికంగాను, విద్యాపరంగాను అభివృద్ధి చెందిన వారిగా అందరూ భావించే వారికి కూడా వర్తిస్తాయి. ఇది అసంబద్ధమైన పరిస్థితి".... అంటూ జమ్మూ- కాశ్మీర్ కేసులో సుప్రీం కోర్టు వాదించిందని డాక్టర్ బాలగోపాల్ పేర్కొన్నారు.

—సన్నిధానం శాస్త్రి

ఆంధ్రప్రభ (దినపత్రిక) 28-10-1990